# మనసుల్లో రంగులు

**- తమిరిశ జానకి**

మెల్లిగా నీరసంగా నడుస్తున్న రామ్మూర్తి మాస్టారు ఎదురుగా వొస్తున్న కారు తన పక్కగా ఆగడంతో ఒక్కక్షణం అలాగే నిలబడిపోయారు. కార్లో వెనకసీట్లో దర్జాగా కూర్చునున్న నాగార్జున్ పలకరించాడు.

"రండి మాస్టారూ..." అంటూనే వెనక డోర్ తెరిచాడు.

ఒక్క క్షణం మాస్టారు తడబడిన మాట నిజం. ఎవరితను? ఎప్పుడో ఎక్కడో చూసిన మొహంలాగే అనిపిస్తోంది మరి!... కానీ ఇంతపెద్ద పడవలాంటి కారున్నవాళ్ళు... కార్లో ఎక్కమని తనని ఆహ్వానించేవాళ్ళు తన పరిచయస్తుల్లో ఎవరూ లేరే!....

"రండి మాస్టారూ... ఎప్పుడొచ్చారీ ఊరు? నన్ను గుర్తుపట్టలేదా? టెన్త్ వరకూ మీ స్టూడెంట్‌ని... నాగార్జున్‌ని...."

గుర్తొచ్చింది మాస్టారికి... ఎప్పటిమాట!... పన్నెండేళ్ళో పదమూడేళ్ళో అయింది మరి...

"చాలా మారిపోయావోయ్! వెంటనే గుర్తుపట్టలేకపోయాను.. ఔన్లే... అప్పుడు చిన్న కుర్రాడివి" నవ్వాడు మాస్టారు.

ఆ వెంటనే మళ్ళీ అన్నారు "నేనిటువైపుకదోయ్ వెళ్తున్నాను. నువ్వటు వైపు వెళ్తున్నావు..." సందేహంగా చూశారూ కారెక్కమంటుంటే.

"పర్వాలేదు మాస్టారూ... మళ్ళీ మీరెక్కడికి కావాలో అక్కడ నేను డ్రాప్ చేస్తానుగా... ఇన్నేళ్ళ తర్వాత కల్సుకున్నాం... మా ఇంటికోసారి రావాలి మీరు... రండి... కారెక్కండి..."

మరి బతిమాలించుకోడం ఇష్టంలేక కార్లో కూచున్నారు మాస్టారు.

"ఆ... చెప్పండి మాస్టారూ... మీరసలు ఉన్న ఊరు కదలడమే గగనం కదా! ఎప్పుడొచ్చారీఊరు?"

"ఓపని మీద వొచ్చానోయ్! పనైపోయింది. రేప్పొద్దున్న వెళ్ళిపోతాను. బంధువులింట్లో దిగాను. నువ్వీ ఊళ్ళో ఉంటున్నావా?"

"ఔను మాస్టారూ..."

"ఏం ఉద్యోగం?"

"ఉద్యోగం కాదు లెండి. బిజినెస్ చేస్తున్నాను. ఏం బిజినెస్ ఏమిటని మాత్రం అడక్కండి".

మాస్టారి మనసు ఏవేవో ఆలోచిస్తోంది. ఇన్నేళ్ళ తర్వాత తనని గుర్తుపట్టి తనంతట తనే పలకరించడమే కాకుండా ఇంత మర్యాదగా మాట్లాడటం, ఇంటికి రమ్మని కార్లో

ఎక్కించుకోడం... ఆనందంగా ఉంది. అతను తనమీద చూపించే భక్తిగౌరవాలకి తృప్తిగానూ ఉంది.

ఆ రోజుల్లో బాగా అల్లరి చేసే రౌడీ పిల్లల మూకకి లీడర్‌గా ఉండేవాడు. చదువులో తెలివితేటలు సున్నా, ఎందులోనూ మార్కులు సరిగ్గా వొచ్చేవి కావు. అసలు చదివే వాడే కాదు.

"ఇలా అయితే ఎందుకూ పనికిరాకుండా పోతావురా. శ్రద్ధగా చదువుకుని పైకి రావాలిరా... అసలు కొంచెం కూడా చదువన్నది పట్టించుకోకుండా అల్లరిగా తిరిగి కాలం గడిపేస్తే పెద్దయ్యాక బాధపడాలి" అంటూ చివాట్లు వేస్తుండేవాడు తను. కానీ... కానీ... తను చూస్తున్న దేవిటి? నాగార్జున్ ఎంత గొప్పవాడైపోయాడు! ఈ సూటూ బూటూ ఈ కారూ, డ్రైవరూ... ఈ హోదా....

కారు ఆగింది ఓ పెద్ద అందమైన మేడముందు

"రండి మాస్టారూ... ఇదే మా ఇల్లు"

నాగార్జున్ వెనకే అతని ఇంట్లోకి నడిచారు.

పుట్టిబుద్ధెరిగాక అటువంటి ఇంద్రభవనం లాంటి ఇంట్లో ఎప్పుడూ అడుగు పెట్టలేదు... ఎంత గొప్పగా ఉంది...

డ్రాయింగ్ రూమ్‌లో కాకుండా లోపల మరోగదిలోకి తీసికెళ్ళాడు మాస్టార్ని నాగార్జున్.

"కూర్చోండి మాస్టారూ!"

ఆగది ఆడంబరం ఆర్భాటం చూస్తుంటే మరింత మతి పోయింది మాస్టారికి. నగిషీలు చెక్కిన అందమైన ఆ సోఫాలో మెత్తటి కుషన్ మీద కూర్చుని ఆ గదిలోని అడుగడుగూ చిందిస్తున్న దర్పాన్ని ఆ ఇంటి యజమాని నాగార్జున్ ఒలికిస్తున్న ఠీవినీ ఇంతింత కళ్ళు చేసుకుని చూస్తున్నారు మాస్టారు.

పోన్లే... పెద్దయ్యాక ఎందుకూ పనికిరాకుండా పోతాడేమో ననుకున్న తన విద్యార్థి ప్రయోజకుడయ్యాడు... గొప్పవాడయ్యాడు. ఇంతకంటే తృప్తి ఆనందం మరెందులో ఉన్నాయి?

గోడకున్న ఓ స్విచ్ నొక్కాడు నాగార్జున్. మరునిమిషంలో తలుపు దగ్గిర హాజరయ్యాడు ఓ వ్యక్తి.

"లోపలికిరా" అధికారపూర్వకంగా పలికింది నాగార్జున్ గొంతు హుందాతనాన్ని మరింత మిళితం చేసి.

లోపలికొచ్చిన అతన్ని చూస్తూనే మాస్టారు గుడ్లప్పగించారు.

ఇతను... ఇతను... శ్రీహరి కాదూ? ఔను.... అలాగే ఉన్నాడు.

అప్పటిలాగే సన్నగా రివటలా... కళ్ళల్లో అప్పటి అధైర్యం వయసుతో పాటూ పెరుగుతూ వొచ్చినట్టుందే తప్ప ఏ మాత్రం తరిగినట్టు లేదు... నాగార్జున్‌కి క్లాస్ మేట్ కదా శ్రీహరి. చదువులోనూ తెలివితేటల్లోనూ స్కూల్ మొత్తానికి మొదటివాడుగా ఉండేవాడు. సుగుణాలగని... పెద్దలంటే భయం భక్తీ గౌరవం మెండుగా ఉండేవి. ఎప్పుడూ ఏ మాస్టారికీ నమస్కరించిన పాపాన పోయేవాడు కాదు నాగార్జున్. అందుకు పూర్తి వ్యతిరేకంగా ఉండేవాడు శ్రీహరి. చదువులో తెలివితేటల్లో మాత్రమే కాదు.... పెద్దలన్నా గురువులన్నా శ్రద్ధాభక్తులుండేవి. తప్పకుండా పైకొస్తాడు ఈ కుర్రాడని ముచ్చటపడేవాడు తను. ఎనిమిది మంది సంతానంలో నాలుగోవాడు శ్రీహరి. ముగ్గురక్కలు ముగ్గురు చెల్లెళ్ళు ఒక తమ్ముడు... పెద్ద కుటుంబం... తండ్రి బట్టలకొట్లో పద్దులు రాసేవాడు.

మాస్టార్ని గుర్తుపట్టిన శ్రీహరి కళ్ళల్లో ఆశ్చర్యం తోకూడిన ఆనందం తొంగిచూసింది.

నిత్యం దైన్యంతో నిరాశా నిస్పృహలతో గాజు గోళీల్లా ఉండే అతని కళ్ళల్లోకి వింతకాంతి వచ్చింది. ఏదో చెప్పలేని... మాటల్లో వర్ణించలేని మూగభావనతో చేతులు జోడించాడు మాస్టారికి. పెదవులు కదిలాయి పలకరించాలన్న తపనతో... కానీ... చిన్నపిల్లాడి చేతిలో లడ్డూని కాకి తన్నుకుపోయినట్టు... శ్రీహరి నోట్లోంచి మాట రానివ్వకుండానే గబుక్కున కావాలనే అడ్డుకున్నాడు నాగార్జున్.

"ఆ... శ్రీహరి... మా ఇద్దరికీ టిఫినూ, కాఫీ పంపించమని అమ్మగారితో ఓ ముక్క చెప్పు. చెప్పేశాక ఇందాకటి ఆ కాగితాలపని చూసే ముందు ఒక్కసారి మా అబ్బాయి స్కూల్‌కి వెళ్ళి ఫీజు కట్టేసిరా"

అన్నిటికీ తల ఊపి మౌనంగా అక్కడినించి వెళ్ళిపోయాడు శ్రీహరి. తెల్లబోయి చూస్తుండిపోయారు మాస్టారు.

"వాడు మీకు గుర్తుండేఉంటాడు మాస్టారూ... శ్రీహరి...."

ఎందుకోగానీ నాగార్జున్ "వాడు" అన్నమాటని అదోరకంగా పలకడం నచ్చలేదు మాస్టారికి.

"ఔనుగానీ.. శ్రీహరి ఇక్కడ మీ ఇంట్లో?..." అర్థోక్తిలో ఆగిపోయారు.

"మా ఇంట్లో నాచేతి కిరద ఉద్యోగం ఇచ్చాను మాస్టారు వాడికి"

చివుక్కుమంది మాస్టారి మనసు.

"ఇంకోడి చేతికింద ఉద్యోగం చెయ్యడం అంటే నాకిష్టంలేదు మాస్టారూ. అందుకే బిజినెస్‌లోకి దిగాను. ఎటొచ్చీ నా బిజినెస్ వివరాలు మాత్రం అడక్కండి. ఏ ఉద్యోగం చేస్తే మటుకు ఇలాంటి రాజ భవనం లాంటి ఇల్లు ఇంత చిన్న వయసులోనే కొనగలను చెప్పండి".

"నిజమేలే బాబూ" ఆయన స్వరంలోని వ్యంగ్యం అర్థం కాలేదు నాగార్జున్‌కి.

"మా ఆవిడ లక్షాధికార్లమ్మాయి. మాకొక అబ్బాయి మాస్టారూ. వాడు చదివేది చాలా ఖరీదైన స్కూల్... నెలకి వాడి చదువుకి చాలా ఖర్చవుతుంది...." చెప్పుకుపోతున్నాడు నాగార్జున్ తన గొప్పలు.

మాస్టారి మనసు శ్రీహరి గురించే ఆలోచిస్తోంది. అవతల శ్రీహరి మనసు కూడా గతంలోకే చూస్తోంది.

!+!+!+!

"మా అబ్బాయి ఎలా చదువుతున్నాడు మాస్టారుగారూ?"

"మీ అబ్బాయికేమోయ్! దివ్యంగా చదువుతున్నాడు"

"ఏదో మామీదున్న అభిమానం కొద్దీ..."

"అబ్బెబ్బే! పొగడ్తలు కాదోయ్! స్కూల్ మొత్తానికి తెలివైన కుర్రాడు మీ అబ్బాయే... భవిష్యత్తులో చాలా పెద్ద ఉద్యోగస్తుడవుతాడు". శ్రీహరి తండ్రి కళ్ళు ఆనందంతో మెరిశాయి. "మీ దయ వల్ల మావాడంతటివాడైతే అంతకంటే మాకేం కావాలి మాస్టారూ?'

"మధ్యన నాదయ ఏమిటోయ్? అంతా ఆ భగవంతుని దయ"

శ్రీహరి తల్లి మాత్రం ఎప్పుడూ చాలా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. బాగా చదువుకోవాలనీ బుద్ధిగా ఉంటూ మంచిపేరు తెచ్చుకవాలనీ కోరికా పట్టుదలా ఉండేవి శ్రీహరికి.

శ్రీహరి తెలివైన వాడని కడుపుమంటగా ఉండేది నాగార్జున్‌కి. తమ అల్లరి మూకలో కలవనందుకు మహా కోపంగానూ ఉండేది. ఏదో కక్ష సాధించెయ్యాలి వాడి మీద అన్నట్టుగా ఉండేది ఆ కోపం. తన మీద నాగార్జున్ కున్న కోపతాపాలు పట్టించుకునే వాడే కాదు శ్రీహరి. తన చదువేమిటో తనేమిటో అన్నట్టుగా ఉండేవాడు.

!+!+!+!

ఓ రోజు రామ్మూర్తి మాస్టారింటిముందు నించి వెళ్తున్నాడు శ్రీహరి. అప్పుడే ఇంట్లోంచి బయటికి వొచ్చిన మాస్టారి రెండో అమ్మాయి కంగారుగా పిల్చింది శ్రీహరిని.

"మా నాన్నగారు ఊళ్ళోలేరు. అమ్మకి హైటెంపరేచరొచ్చింది. పిల్చినా పలకట్లేదు. మా డాక్టర్ గారు సత్యమూర్తి గారు తెల్సుకదూ నీకు?"

"తెల్సండీ..."

"త్వరగా వెళ్ళి సంగతి చెప్పి ఆయన్ని తీసుకొస్తావా?"

"తీసుకొస్తానండీ"

"ఇంకొంచెం సేపట్లో ఆయన తన క్లినిక్కి వెళ్ళిపోతారు. ఇప్పుడు తొందరగా వెళ్ళావంటే ఇంట్లో ఉంటారు. ముందు ఇటొచ్చేసి చూసి తర్వాతే క్లినిక్కి వెళ్తారు".

"అలాగేనండీ. తొందరగానే వెళ్తాను" మరి ఒక్కక్షణం ఆలస్యం చెయ్యలేదు శ్రీహరి. దోవలో సైకిల్‌మీద వొస్తూ నాగార్జున్ కనిపించాడు.

"ఒక్కసారి నీ సైకిల్ మీద నన్ను డాక్టర్ సత్యమూర్తి గారింటి దగ్గిర డ్రాప్ చేస్తావా నాగార్జున్? రామ్మూర్తి మాస్టారు వాళ్ళావిడకి బాగా జ్వరంగా ఉందిట. అర్జంటుగా డాక్టరు గార్ని పిల్చుకురావాలి."

"వీల్లేదునాయనా" ఎగతాళిగానవ్వాడు.

"ఊళ్ళో ఎవరికో జ్వరం వొస్తే నాటైము వేస్టు చేసుకోలేను. శేఖర్ గాడింటికెళ్ళి క్యారమ్స్ ఆడుకోవాలి నేను" విజిల్‌వేసుకుంటూ హుషారుగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు నాగార్జున్. వెళ్తూ వెళ్తూ మరో మాట కూడా అన్నాడు.... శ్రీహరి మనసునొప్పించే మాట... "మాస్టారిమీద అంత భక్తిగౌరవాలు పొంగిపోతుంటే డాక్టర్ని తీసుకురావడానికి అర్జంటుగా వెళ్ళాలనుకుంటే రిక్షాలో వెళ్ళకూడదు? ఓహో... అన్నట్టు రిక్షాకి డబ్బులు మీ నాన్న ఇవ్వలేదు కదూ! ఆ రిక్షా డబ్బులే ఉంటే నీ తెగిపోయిన చెప్పులు కుట్టించుకునే వాడివిగా?" నాగార్జున్ సైకిల్ అటు వెళ్ళిపోయింది. ఇటు దాదాపు పరిగెడుతున్నట్టే డాక్టర్ గారిల్లు చేరుకున్నాడు శ్రీహరి. పరుగు మూలంగా కలిగిన ఆయాసంతో రొప్పుతూ తన ఎదురుగా నిలబడిన కుర్రాడిని చూస్తూనే అతనే పేషంటు అనుకున్న డాక్టర్ గారికి తనెందుకొచ్చిందీ అసలు విషయం చెప్పాడు శ్రీహరి. 'పద వెళ్దాం' వెంటనే బయల్దేరాడు డాక్టర్ సత్యమూర్తి.

రిక్షా బేరమాడుతున్నాడన్నమాటే గానీ... రానూ పోనూ రిక్షా డబ్బు లెలా ఇవ్వాలా అన్న ఆలోచనతో భయం పట్టుకుంది శ్రీహరికి. మాస్టారమ్మాయి తనంతటతనే రిక్షా డబ్బుల గురించి ప్రస్తావిస్తే పర్వాలేదు గానీ... లేకపోతే రిక్షా డబ్బులివ్వండని ఎలా అడగగలడు తను! ఇంతలో దేవుడు కరుణించినట్టు తండ్రి కనిపించాడు అటువైపే వొస్తూ. సంగతి చెప్పి డబ్బులే వన్నావుంటే ఇమ్మన్నాడు.

"చిన్న చెల్లాయి పుట్టిన్రోజు కదురా ఇవాళ. కొత్తబట్టలెలాగో కుట్టించలేకపోయాను. కనీసం కొత్త రిబ్బన్లయినా కొనిపెట్టమని పేచీ పెడుతోందది. రిబ్బన్లకి, నాలుగు ప్లాస్టిక్ గాజులు కొనడానికి సరిపడా డబ్బులున్నాయి. కొనుక్కొస్తానని చెప్పి ఇలా బయల్దేరాను". జేబులోంచి ఆ డబ్బులు తీసి కొడుకు చేతిలో పెట్టేశాడు తండ్రి.

"తొందరగా తీసికెళ్ళు డాక్టర్ గార్ని. ఆవిడకి నయమైతే అంతే చాలు. మాస్టారు గారు కూడా ఊళ్ళో లేరంటున్నావు పాపం. ఆపిల్లలొక్కళ్ళూ ఏం కంగారు పడుతున్నారో ఏమో!"

"సరే... నేనొస్తాను" వెనక్కి తిరిగాడు శ్రీహరి.

"రేపు నాన్నగారు ఊర్నించి రాగానే మీ దగ్గిరి కొచ్చి ఫీజు ఇచ్చేస్తారు డాక్టర్ గారూ" తల్లికి ఇంజక్షన్ ఇచ్చి వాడవల్సిన మాత్రలు తనచేతిలో పెడుతుంటే అంది మాస్టారి పెద్ద

కూతురు. తల్లి నా పరిస్థితిలో చూస్తుంటే ఆ పిల్లకి ఏడుపు ముంచుకొస్తోంది. ఆ గాభరాలో డాక్టర్ గారీ ఫీజు గురించొక్కటే ఆలోచించింది గానీ డాక్టర్ గారు ఎలా వొచ్చారు రిక్షా డబ్బులిచ్చుకోవాలి కదా అన్న ధ్యాసే లేకపోయింది. కళ్ళల్లో నీళ్ళతో తల్లి మంచం దగ్గిరే చతికిలపడిపోయింది కూడా. అసలే తల్లిని చూసి కంగారు పడుతున్న రెండోది అక్కని అలా చూసి మరింత బెంబేలు పడిపోయి పెరట్లోకి పారిపోయింది.

తనపుట్టినరోజునాడు కనీసం కొత్త రిబ్బన్లయినా కొనిపెట్టలేదని చిన్న చెల్లాయి ఏడుస్తుంటే దాన్ని ఊరుకోపెట్టడానికి తన శాయశక్తులా ప్రయత్నించాడు శ్రీహరి. ఆ పిల్లని నవ్వించడానికి ఎన్ని కోతివేషాలెయ్యచ్చో అన్నీ వేశాడు. చివరికెలాగైతేనేం దానికి నచ్చచెప్ప గలిగాడు.

మాస్టారి పెద్దకూతురి పెళ్ళొచ్చింది.

"నీకెందుకురా అబ్బాయ్ కష్టం.... నువ్వు కూచో హాయిగా" అని మాస్టారు అంటున్నా వినకుండా పెళ్ళిరోజు తనకి చేతనైన పనుల్లో సాయపడుతూ వాళ్ళింట్లో ఒకడిలా తిరిగాడు శ్రీహరి.

"వీడు నా స్టూడెంట్... చాలా తెలివైనవాడు" అల్లుడికి మాస్టారు తనని పరిచయం చేస్తుంటే ఎంతో మొహమాటపడిపోయాడు శ్రీహరి"

మర్నాడు స్కూల్లో నాగార్జున్ గ్యాంగు తనవెనకాల చేరి వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడు కుంటున్నట్టు ఒకళ్ళతో ఒకళ్ళు అనుకుంటూ తనని ఇన్‌డైరెక్టుగా మాటలు అంటుంటే విని ఊరుకోడం తప్ప వెనక్కి తిరిగైనా చూడలేదు.

"ఏరా మాస్టారింట్లో పెళ్ళి పనులకి కుదురుకున్నావా?" అని ఒకడంటే "ఔనురా" అని మరొకడి జవాబు.

పెళ్ళిపనుల్లో మాస్టారికి... సరదాగా సాయంచేసిన వాళ్ళు తను కాక మరి కొంత మంది ఉన్నప్పుడు వీళ్ళు తననే ఎందుకూ ఆటపట్టిస్తున్నారు? తిరుగుతూ తనకి చేతనైన పనుల్లో సాయం చేస్తే తప్పేముంది? వాళ్ళు వెనకనించి ఇంకా ఏవేవో మాటలంటూనే ఉన్నారు. అవేమీ పట్టించుకోదల్చుకోలేదు శ్రీహరి.

"పెద్దయ్యాక డాక్టరునవుతావు ఇంజనీరువవుతావు కలెక్టరువవుతావు అంటూ మనవాడిని పొగిడేసి పనులు చేయించుకునుంటారు మాస్టారు. అసలాయనగారు మనవాడి నెప్పుడూ పొగిడేది అందుకే... పనులు చేయించుకుంటూ ఉండేందుకే".

ఈ మాటలకి మటుకు చాలా బాధనిపించింది శ్రీహరికి.

వాళ్ళు తనని ఎన్ననుకున్నా పర్వాలేదు... కానీ... అనవసరంగా లేనిపోని మాటలు మాస్టారినెందుకూ అనడం? రామ్మూర్తి మాస్టారెంత మంచివారో అందరికీ తెలుసు. అటువంటి మాస్టారిగురించి హీనంగా ఎలా మాట్లాడగలుగుతున్నారు? తనగురించి వేళాకోళంగా ఎన్నిమాటలనుకున్నా బాధపడని శ్రీహరికి మాస్టారినలా అనేసరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి...

!+!+!+!

"అయితే... శ్రీహరీ వాళ్ళకుటుంబం ఈ ఊళ్ళో ఉంటున్నారన్నమాట".

చాలాసేపటి తర్వాత మాస్టారి నోట్లోంచి వచ్చిందామాట.

"ఔనుమాస్టారూ... వాళ్ళ నాన్న పోయాడు. తనకేమో ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. కుటుంబ బాధ్యత నెత్తిన పడింది. వాళ్ళ మావయ్యొచ్చి నా కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు నా దగ్గిరేదన్నాపని ఇప్పించమని వాడికి... ఏ పని చెప్పినా మాట్లాడకుండా చేసుకు పోయేటట్టయితే పంపించమని చెప్పాను. అలాగే చేస్తాడు తప్పుతుందామరి... లేకపోతే ఇల్లు గడవడం కష్టం అని వెంటనే వాడిని వెంటపెట్టుకొచ్చాడాయన... అదిగో అప్పట్నించీ నా చేతికింద పనిచేస్తున్నాడు...."

నాచేతికిందపని చేస్తున్నాడు అన్నమాటని నాగార్జున్ గట్టిగా ఒత్తిపలకటం మాస్టారు గమనించారు. ఆయన మనసు చివుక్కుమంది. ఇంతలో ప్లేట్లలో రకరకాల స్వీట్లు హాట్లు ఒక పెద్ద ట్రేలో పెట్టి తీసుకొచ్చి ఎదురుగా టీ పాయ్ మీద అమర్చాడు వంటవాడు.

"తీసుకోండి మాస్టారూ"

పరీక్షగా నాగార్జున్ వంక చూశారు మాస్టారు.

చదువుకునే రోజుల్లో ఎప్పుడూ తనకే కాదు ఏ మాస్టారికీ కూడా చెయ్యెత్తి నమస్కరించిన పాపాన పోలేదు ఇతను... అసలు టీచర్లంటే కొద్దిగా కూడా గౌరవం ఉండేది కాదు. ఏ టీచర్ మాటా వినేవాడు కాదు. చాలా నిర్లక్ష్యంగా చూసేవాడు. భయం గానీ భక్తి గానీ ఏదీ ఉండేది కాదు. అటువంటి ఇతను ఇప్పుడెంతగా మారిపోయాడు. ఎంత వినయవిధేయతలు చూపిస్తున్నాడు తనపట్ల! ఎంత మర్యాదగా మాట్లాడుతున్నాడు! మా ఇంటికి రండి మాస్టారూ అంటూ ఎంతో వినయంగా ఆహ్వానించడమే కాక తనకార్లో తీసుకొచ్చాడు... పోన్లే... టీచర్ల పట్ల చులకన భావం ఇప్పటికైనా పోయింది. కాస్త మర్యాద గౌరవ భావం చూపిస్తున్నాడు. అంతే చాలు... ఈ ఫలహారాలకంటే అదే పదివేలు.

"తీసుకోండి మాస్టారూ".

మళ్ళీ ఇంకోసారి నాగార్జున్ అడగడంతో ఒక స్వీట్ చేతిలోకి తీసుకున్నారు. ఇంతలో వాళ్ళావిడ కాబోలు ఏవండీ అంటూ గది బయటనించి పిలిస్తే "ఇప్పుడే వొస్తాను మాస్టారూ" అంటూ వెళ్ళాడు.

"ఎవడా ముసలాడు? వీధివరండాలో కూచోపెట్టి మాట్లాడి పంపించెయ్యక ఇలా గదిలోకి తీసికెళ్ళి కూచోపెట్టారేమిటి ఎవడో గొప్ప వాడిలాగా? ఆ బట్టలు చూస్తుంటేనే తెలుస్తోంది ఎలాంటివాడో... పైగా ఈయనగారికి టిఫిన్లూ, కాఫీలూ కూడానా?... ఇలాంటి వాళ్ళని మేపడానికా మనం స్వీట్లూ హాట్లూ చేసుకునేది?"

"మెల్లిగా మాట్లాడు... వినగలడు ముసలాడు. రిటైరయితే అయ్యాడు గానీ చెవులు

బాగానే పనిచేస్తున్నాయి."

"ఇంతకీ ఎవరా ముసలాడు? ఇందాక మీరు లోపలికి తీసికెళ్తున్నప్పుడు చూశాను"

"హై స్కూల్లోనేనాయన స్టూడెంట్‌ని"

"ఏనాటి బడిపంతులు మీదో ఇంత భక్తి గౌరవం హఠాత్తుగా ఎందుకు పుట్టుకొచ్చాయి మీకు?"

"భక్తీ కాదు గౌరవం కాదు.. ఆయనకి నా గొప్పలు చూపించుకుందుకు తీసుకొచ్చాను మనింటికి. ఆ శ్రీహరి గాడు చదువులో తెలివైనవాడని తెగమురిసిపోతూ ఉండేవారు వాడిని చూసి. అందుకని నేనెంత దర్జాగా బతుకుతున్నానో నా దాబూ దర్ప చూపించడానికి... ఆ శ్రీహరిగాడు నా చేతి కింద గుమాస్తాగా పనిచేస్తున్నాడని చూపించేందుకు మనింటికి తీసుకొచ్చాను. తన మీద గౌరవం అని మురిసిపోతున్నాడేమో ముసలాడు!" ఎంతో మెల్లగా మాట్లాడాననుకున్నాడు నాగార్జున్. కానీ అతని మాటలు, వ్యంగ్యమైన నవ్వు మాస్టారికి వినిపించి గుండెల్లో గుచ్చుకున్నాయి. చిన్న ముక్క చేత్తో తుంపి అంతకు ముందే నోట్లో వేసుకున్న స్వీటు ఎంతో చేదుగా అనిపించింది. చేతిలో ఉన్న మైసూర్‌పాక్ ముక్క పక్కన పెట్టేశారు. విశాలమైన ఆ గది ఎంతో ఇరుకుగా తోచింది.

ఆ గదిలో ఎ.సి. ఉంది కానీ ఊపిరాడనట్టుగా ఉంది.

తన విద్యార్థులెవరూ కలెక్టర్లూ ఇంజినీర్లూ డాక్టర్లూ ఆఫీసర్లూ అవకపోయినా పర్వాలేదు... నాగార్జున్ లాంటి మనస్తత్వం గలవాళ్ళు ఇంకెవరూ తయారయి ఉండకుండా ఉంటే అంతే చాలు అనిపించింది మాస్టారికి. మరి ఒక్కక్షణం కూడా ఆ ఇంట్లో ఉండాలని అనిపించలేదు.

అదేమిటి మాస్టారూ వెళ్ళిపోతున్నారు.... పైగా టిఫినేమీ తీసుకోలేదు... ఇంకా ఇల్లంతా చూపించనే లేదు మీకు... మా ఇల్లు చాలా పెద్దది. పైన మేడ మీద కూడా పెద్ద పెద్ద గదులున్నాయి..."

"ఇంత పెద్ద ఇల్లు తిరిగి చూసే ఓపిక ఈ ముసలాడికి లేదు బాబూ! శ్రీహరి ఇంటి అడ్రస్ ఇవ్వు... వాళ్ళింట్లో వాళ్ళని పలకరించి వెళ్తాను. వాళ్ళిల్లు చిన్నదే అయి ఉంటుంది కదా! చిన్న ఇల్లయితే తిరిగి చూడగలను" ఈ మాటలు పైకి అని లోపల మాత్రం ఇల్లు చిన్నదైనా వాళ్ల మనసులు పెద్దవి కాబట్టి అక్కడ ఊపిరాడుతుంది నాకు. ఈ ఇల్లు పెద్దదైనా ఇంట్లో వాళ్ళ మనసులు చిన్నవి కావటం వల్ల నాకిక్కడ ఊపిరాడటం లేదు అనుకున్నారు మాస్టారు.

★☆★☆★